క్లుప్తంగా

ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు



టాయిలెట్లను పరిశీలిస్తున్న కమిషనర్ రంగారావు, డీఈ శ్రీనివాస్

మండపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో పబ్లిక్ టాయిలెట్లను ప్రయాణికుల సౌలభ్యం కోసం ఆధునిక వసతులతో అభివృద్ధి చేశామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. టాయిలెట్ల ఆధునికీకరణ పనులను బుధవారం డీఈ శ్రీనివాస్‌తో కలిసి కమిషనర్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీలేకుండా చేయిస్తున్నామన్నారు. పట్టణంలో ఒక పబ్లిక్ టాయిలెట్, 11 కమ్యూనిటీ టాయిలెట్లలో జనరల్ ఫండ్స్ నిధులు రూ. 14 లక్షలతో మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు.

సప్తాహ మహోత్సవాన్ని విజయవంతం చేయండి

కాజులూరు: తణుకువాడ రామాలయం వద్ద గురువారం నుంచి జరగనున్న చతుర్థ సప్తాహ మహోత్సవాన్ని భక్తులు విజయవంతం చేయాలని నిర్వాహక కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం వారితో పాటు భక్త బృంద సభ్యులు పరిసర గ్రామాల్లో పర్యటించారు. సప్తాహ మహోత్సవానికి హాజరు కావాలని భక్తులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామాలయం వద్ద కమిటీ సభ్యులు మాట్లాడుతూ గురువారం ఉదయం జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమయ్యే భజన కార్యక్రమాలు 26వ వరకూ నిర్విరామంగా కొనసాగుతాయన్నారు. చివరి రోజు జ్యోతిర్లింగార్చన, అన్నసమారాధనతో ముగుస్తాయన్నారు. పరిసర గ్రామాలకు చెందిన భజన బృందం సభ్యులు, భక్తులు సప్తాహ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అయ్యప్పనాయుడు

రామచంద్రపురం: స్థానిక పురపాలక సంఘం పరిధిలో ప్రతి షాపు, రెస్టారెంట్లు, హోటల్స్, టీ స్టాల్స్ వద్ద ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా విడనాడాలని కమిషనర్ అయ్యప్ప నాయుడు ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం హోటల్స్, రెస్టారెంట్స్, టీ స్టాల్ యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా 120 మైక్రాన్ కన్నా తక్కువగా ఉండే క్యారీ బ్యాగ్‌లను వాడరాదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలన్నారు. టీ స్టాల్స్‌లో పేపర్ గ్లాసులు వాడకూడదని, గాజు, పింగాణీ గ్లాసులు వాడాలని కమిషనర్ సూచించారు.

వీఎస్ఎంలో సైన్స్ ఫ్యూజన్ 2కే 25



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మూర్తి తదితరులు

రామచంద్రపురం: స్థానిక వీఎస్ఎం డిగ్రీ అటానమస్ కళాశాలలో ఈ నెల 28 నుంచి మార్చి 1వ వరకూ రెండు రోజులు సైన్స్ ఫ్యూజన్ 2కే 25 నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు సైన్స్ ఫ్యూజన్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కళాశాలలోని సైన్స్ విభాగాలకు చెందిన విద్యార్థులంతా వివిధ అంశాలపై ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శిస్తారని ఆయన తెలిపారు. ఈ నెల 28న వీఎస్ఎం కళాశాల పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులంతా వీక్షించేందుకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎస్ ఆలీ అన్సారీ వివరించారు. ప్రదర్శనకు వచ్చే విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫణికుమార్, చంద్రావతి, కేవీవీఎస్ చౌదరి, కేవీవీఎస్ఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసం ప్రజలు తెలుసుకున్నారు

మండపేట: బూటకపు హామీలతో గద్దెనెక్కిన సీఎం నారా చంద్రబాబు నాయుడు చేసిన మోసం ప్రజలు తెలుసుకున్నారని, రాష్ట్రంలో జరుగుచున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఎదురు గాలి వీయక తప్పదని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. స్థానిక టౌన్‌హాలు వద్ద వున్న కామాక్షీ కల్యాణ మండపంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై ధ్వజ మెత్తారు. మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు నట్టేట ముంచారన్నారు. కూటమి అభ్యర్థికి ఓటమి తప్పదన్నారు. గ్రాడ్యుయేషన్ ఓటర్లంతా తన కుమారుడు సుందర్‌ను ఆదరించాలని కోరారు. సమావేశంలో యడ్ల రాజేష్, గంట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా..

- జోరందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- 27న పోలింగ్, మార్చి 3న లెక్కింపు
- రెండు నియోజకవర్గాల్లో 17,284 మంది ఓటర్లు

కపిలేశ్వరపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పెద్దల సభ కావడంతో సహజంగా మేధావి వర్గం, ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా కొందరు, పరోక్షంగా కొందరు భాగస్వాములు అవుతుంటారు. మారిన రాజకీయ అవసరాల నేపథ్యంలో పార్టీలు సైతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరాన్ని బరిలోకి దించాయి. పీడీఎఫ్ ఎప్పటిలాగే ప్రజా సంఘాలు, సామాన్య ప్రజల మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులును నిలిపాయి. వారికితోడు పలువురు పోటీలో ఉన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులు మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండలం పడమర ఖండ్రిక గ్రామానికి చెందినవారు.

గతం కంటే పెరిగిన ఓటర్లు

రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో గతంలో 6,800 మంది ఓట్లు ఉండగా, నేటి ఎన్నికల్లో 9,786కి పెరిగారు. అదనంగా 2,986 ఓట్లు చేరాయి. మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో గతంలో 6,498 మంది ఉండగా, నేటి ఎన్నికల్లో 7,498 మంది ఉన్నారు. వెయ్యి ఓట్లు పెరిగాయి. రెండు నియోజకవర్గాల్లో పురుషులు 10,671 మంది, మహిళా ఓటర్లు 6,613 మంది ఉన్నారు. రామచంద్రపురం మండలంలో అత్యధికంగా 2,115 మంది మహిళలు, అత్యల్పంగా కపిలేశ్వరపురం మండలంలో 602 మంది మహిళలు ఓటును నమోదు చేసుకున్నారు. పురుషుల విభాగంలో రామచంద్రపురం మండలంలో 3,321 మంది అత్యధికంగా, కపిలేశ్వరపురం మండలంలో 1,027 మంది పురుషులు ఓటు పొందారు. 2019 ఎన్నికల్లో 65 శాతం పోలింగ్ నమోదైంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 34 నియోజకవర్గాల్లోని పట్టభద్రులను అభ్యర్థులు ఓట్ల కోసం ప్రసన్నం చేసుకుంటున్నారు.



పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలంటూ మండపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ ఐవీ

ఎలాగైనా గెలవాలనే ఆశతో..

ఎన్నికల బరిలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో 35 మంది పోటీ పడుతున్నారు. కూటమి నాయకులు ముందు నుంచీ వారి అనుకూలంగా ఉన్నవారిచే ఓట్లు నమోదు చేయించారు. సాధారణంగా పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలను మేధావులుగా స్థానాలుగా భావించి రాజకీయ పార్టీలు దూరంగా ఉండేవి. కూటమి ప్రస్తుత పట్టభద్రుల స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొంది. క్షేత్ర స్థాయిలో సమావేశాలు సైతం నిర్వహిస్తుంది.

ప్రశ్నించే ఆయుధాన్ని ఇవ్వాలంటూ..

పీడీఎఫ్ అభ్యర్థి ప్రచారం హంగూ ఆర్భాటాలు లేకుండా చాపకింద నీరులా సాగుతుంది. ప్రజల్లో ఆలోచనలను రేకెత్తిస్తూ సంకల్పాన్ని సాధించేలా కృషి చేస్తున్నారు. శ్రామిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పీడీఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నారు. అభివృద్ధికి ఓటెయ్యండంటూ కూటమి నుంచి ప్రచారం చేస్తుండగా... 7 నెలల పాలనలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలంటూ పీడీఎఫ్ అనుకూల నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో కూటమి తీరును ప్రశ్నిస్తున్నారు. ప్రశ్నించే పట్టభద్రుల ఆయుధాన్ని పాలించే వారి



పడమర ఖండ్రికలో ఓట్లను అభ్యర్థిస్తున్న కూటమి కార్యకర్తలు

చేతుల్లో పెట్టడం వల్ల ఏమీ ప్రయోజనం ఉండదంటూ ఓటర్లలో ఆలోచనలను రేకెత్తిస్తున్నారు. పాలక వర్గానికి ఓటేస్తే ప్రజలకివ్వాల్సిన ప్రయోజనాలు కోసం ప్రశ్నించే గొంతు మూగబోతుందని, పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రజల్లోనూ, ప్రజా సంఘాల్లోనూ తలలో నాలుకగా పాటుపడతారంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రజల్లో పీడీఎఫ్ ప్రజాప్రతినిధులు ఎలా పనిచేస్తారో ప్రస్తుత పీడీఎఫ్ ఎమ్మెల్సీలైన ఇళ్ల వెంకటేశ్వరరావు, గోపీమూర్తిల పనితీరును చూసి నిర్ధారణకు రావాలని ఓటర్లను కోరుతున్నారు. శాసన మండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలను, చేసిన పోరాటాలను పాలక కూటమి ఎమ్మెల్సీల పనితీరుతో పట్టభద్రులు పోల్చి చూసుకోవాలంటున్నారు. రానున్న నాలుగేళ్లలో నిరుద్యోగం, ఆకలి, వేతనాల పెంపు, ఆహార భద్రత తదితర సమస్యలపై పోరాడేందుకు పీడీఎఫ్ అభ్యర్థి గెలవడం అవసరమంటూ ప్రచారం చేస్తున్నారు.

రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీ ఓటర్లు ఇలా..

మండలం	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం ఓటర్లు
రామచంద్రపురం	7	2,115	3,321	5,436
కె.గంగవరం	3	679	1,355	2,034
కాజులూరు	4	839	1,477	2,316
మండపేట	8	1,711	2,295	4,006
రాయవరం	2	667	1,196	1,863
కపిలేశ్వరపురం	3	602	1,027	1,629

సమతా కుంబ్ బ్రహ్మోత్సవాల్లో పాపారాయుడు పూజలు

మండపేట: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి వారి పర్యవేక్షణలో హైదారాబాద్ శంషాబాద్‌లోని ఆశ్రమంలో సమతా కుంబ్ 2025 బ్రహ్మోత్సవాలు కనుల వైకుంఠంగా సాగాయి. వికాస తరంగిణి అధ్యక్షుడు కర్రి పాపారాయుడు బుధవారం హైదరాబాద్ తరలివెళ్లి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ నెల 9న ఆరంభమైన ఉత్సవాలు బుధవారంతో ముగిశాయని తెలిపారు. శ్రీరామానుజాచార్య 108 దివ్యదేశాల తృతీయ బ్రహ్మోత్సవాల సందర్భంగా గత పది రోజులుగా లోకకల్యాణం కోసం చినజీయర్ స్వామి శ్రీమన్నారాయణునికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం పాపారాయుడు జీయర్‌స్వామి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిగాంచిన చినజీయర్ స్వామి అర్తమూరు గ్రామంలో జన్మించడం ఇక్కడి వాసుల పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. పూజల్లో కుడిపూడి రాంబాబు, పలివెల సుధాకర్ పాల్గొన్నారు.



జీయర్ స్వామివారి ఆశీస్సులు అందుకుంటున్న పాపారాయుడు

దారి దోపిడీ దొంగల అరెస్ట్

కాజులూరు: కోలంకలో చెడు వ్యసనాలకు బానిసై దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను గొల్లపాలెం పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 8న కోలంకలో కొండూరి బుచ్చివెంకట సుభద్రమ్మ (72) రోడ్డుపై వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని యువకులు ఆమె మెడలోని రెండు కాసుల బంగారు గొలుసును లాక్కుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకూ గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు. గ్రామంలో ఇటీవల జరుగుతున్న పలు వరస నేరాలపై కాకినాడ రూరల్ సీఐ కృష్ణచైతన్య, కాకినాడ ఏఎస్పీ పాటిల్‌దేవరాజ్ మనిష్ తదితరులు గ్రామంలో పర్యటించి స్థానికులను విచారించారు. ఎట్టకేలకు బుధవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై మోహన్‌కుమార్ తన సిబ్బందితో కలసి యానం, ద్వారపూడి రహదారిలో కోలంక శివారులో హైస్కూల్ వద్ద దొంగతనానికి పాల్పడిన కొడగల వీరబాబు, కూనపురెడ్డి నారాయణ రావులను అదుపులోనికి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్‌కుమార్ మాట్లాడుతూ చోరీ చేసిన గొలుసును ముద్దాయిల నుంచి రికవరీ చేశామన్నారు.



నిందితులను చూపుతున్న ఎస్సై మోహన్‌కుమార్, గొల్లపాలెం పోలీసులు

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

మండపేట: పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించి స్వచ్ఛ మండపేట సంకల్పంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన స్వచ్ఛ మండపేట ఆశయసాధన కోసం డీఈ కే శ్రీనివాస్, శానిటేషన్ అధికారులతో పలు వార్డుల్లో పర్యటించారు. 23వ వార్డు సైదిల్‌పేట వీధుల్లో ప్రతి ఇంటింటా పర్యటించి పరిసరాల శుభ్రత పాటించాల్సిన అంశాలను వివరించారు. తడి, పొడిచెత్త వేరు చేసే విధానం, తడి చెత్తను ఇంటి వద్దే కంపోస్టుగా ఎలా తయారు యాలి, దాని ద్వారా వచ్చే ఎరువును మొక్కలకు ఎలా వినియోగించాలి అనే దానిపై తెలియజేశారు. బురుగుంట చెరువు వద్ద ఉన్న ఓస్వీట్ తయారీ కేంద్రాన్ని పరిశీలించి ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇష్టానుసారం పారేసిన బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను చూసి ఆయన యజమానికి రూ.5 వేలు జరిమాన విధించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వార్డు శానిటేషన్ సెక్రటరీ సెక్రటరీ జి.సుధీర్, ప్లానింగ్ సెక్రటరీలు, మెప్మా ఆర్‌పీలు ఉన్నారు.



23వ వార్డులో మహిళలకు శుభ్రత కోసం తెలియజేస్తున్న కమిషనర్, డీఈ

బీజేపీ ఆధ్వర్యంలో శివాజీ జయంతి



శివాజీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

మండపేట: ఛత్రపతి శివాజీ జయంతిని పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ యువమోర్చా అధ్యక్షుడు వెత్సా ప్రసాద్ నేతృత్వంలో రథంగుడి వద్ద శివాజీ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాడా శ్రీనివాసరావు, కే సాంబశివరావు, గొడవర్తి రామచంద్రరావు, పాలిక రమణ, దుగ్గిరాల శివ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పరిహారం తీసుకోవాలి

మామిడికుదురు: జాతీయ రహదారి 216 రోడ్డు నిర్మాణంలో భాగంగా భూసేకరణకు అవార్డు పాసై భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు త్వరగా నష్ట పరిహారం తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడారు. తమకు చదరపు గజాల్లో పరిహారం చెల్లించాలని బాధితులు కోలా శ్రీను, బండారు సరయ్యకాపు తదితరులు కోరారు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా రోడ్డు నిర్మాణం ఆగదని, ఇప్పటికే రెండు వైపులా రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చిందని కలెక్టర్ తెలిపారు. స్థానికంగా మాత్రమే నిర్వాసితుల నుంచి అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. వెంటనే నష్ట పరిహారం తీసుకోవాలని, తదుపరి భూముల విలువ పెంపు డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. రోడ్డు నిర్మాణంలో అడ్డంకిగా ఉన్న గృహాల నిర్వాసితులు రోడ్డు నిర్మాణానికి సహకరించకపోవడం సరికాదన్నారు. ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా అంచనాల విలువలు గణించేందుకు సహకరించాలని కోరారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన భయం లేదన్నారు. నిర్వాసితులకు ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. ఆర్డీఓ కె.మాధవి, ఎన్‌హెచ్ సహాయ ఇంజినీర్ వెంకటరమణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఆచార్యులు ఉన్నారు. ఈదరాడ గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను కలెక్టర్ పరిశీలించారు. కరవాకలో చేపట్టిన చెరువుల ధ్వంసం పనులను పరిశీలించారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేస్తూ అక్రమ చెరువులను త్వరగా ధ్వంసం చేయాలని వారు అన్నారు.



మామిడికుదురులో ఎన్‌హెచ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మండపేట: దేశంలో గొప్ప యోధుడిగా చరిత్ర పుటల్లో నిలిచిన ఛత్రపతి శివాజీ జయంతిని మండపేటలో ఘనంగా నిర్వహించారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, పట్టణ పరిధిలోని 30వ వార్డు సంగం కాలనీలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ముత్యాల మాణిక్యాంబల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలు ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శివాజీ జీవిత చరిత్రను తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, సత్యనారాయణ, ద్వారపూడి ఉపాధ్యాయులు కే జ్యోతి, వైభ్రమరాంబ, అబ్బులు, జీ ధనలక్ష్మి, వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీకాకుళం శంకర్, గ్రామస్తులు కంకటాల మురళీ, నున్న సతీష్, బొలిశెట్టి సురేష్‌కుమార్, కందుల ఫణీంద్ర, తట్టవర్తి రమేష్, వాకచర్ల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



సంగం కాలనీ పాఠశాలలో శివాజీ జీవిత చరిత్రను వివరిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని విశ్వ హిందూ పరిషత్ యువజన విభాగం భజరంగ్ దళ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు ద్రాక్షారామకు చెందిన తోట రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. హైందవ ధర్మానికి శివాజీ చేసిన సేవలను వివరిస్తూ ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణం నుంచి ప్రారంభించి ప్రధాన రహదారి వరకూ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణ, నాయకులు సంపత్, చోడిశెట్టి శివాజీ, అల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

మండపేటలో హుండీల చోరీ

మండపేట: మండపేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి దుండగులు రెచ్చిపోయారు. ఎక్కడ కనబడితే అక్కడ హుండీలను పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లి పోయారు. బుధవారం ఉదయానికి ఈ సంఘటన కలకలం రేపింది. దీనిపై ఆలయాల నిర్వాహకులు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో టౌన్ సీఐ దారం సురేష్, ఎస్సై హరికోటి శాస్త్రిలు వెంటనే స్పందించి సంఘటన ప్రాంతాలను పరిశీలించారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీ జనార్దన అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయం(రథం గుడి) వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఉన్న హుండీ, మారేడుబాక రోడ్డులోని పేపర్‌మిల్లు సమీపంలో ఉన్న వినాయకుడి గుడి, ఫైర్‌స్టేషన్ సమీపంలోని రామాలయంలోని హుండీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని భక్తుల కానుకలను దోచుకుపోయారు. ఒకే రోజు రాత్రి మూడు ఆలయాల వద్ద జరిగిన వరుస దొంగతనాలపై ప్రజలు ఆశ్చర్యపోయారు. సీఐ సురేష్ రథం ఆలయంలో ఉన్న సీసీ పుటేజ్‌లను శోధించి దుండగల ఆచూకీని తెలుసుకునే ప్రయత్నం చేశారు. కేపీ రోడ్డులో ఉన్న పలు సీసీ కెమేరాలను కూడా ఆయన ఎస్ఐ శాస్త్రితో కలిసి పరిశీలించారు. గతంలోను ఇదేవిధంగా రథంగుడి ఆంజనేయ స్వామి హుండీ చోరీ జరిగింది. సీసీ కెమేరాల ద్వారా కొంతమేర ఆధారం లభించిందని, అలాగే ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా నేరస్తులు ఎవరనేది త్వరగా పట్టుకుంటామని ఎస్ఐ శాస్త్రి తెలిపారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



రథంగుడి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పరిశోధిస్తున్న సీఐ సురేష్, ఎస్ఐ శాస్త్రి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



కపిలేశ్వరపురం సీహెచ్‌సీ ఆవరణలో చెత్తను సేకరిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు

కపిలేశ్వరపురం: పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుందని కపిలేశ్వరపురం సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రాజ్‌కుమార్ అన్నారు. ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వయంగా ఆసుపత్రి ఆవరణను సహవైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వెల్లలో దారి దోపిడీ

పోలీసుల అదుపులో నిందితుడు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో మంగళవారం రాత్రి దారి దోపిడీ సంఘటన చోటుచేసుకుంది. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ కథనం ప్రకారం.. వెల్ల గ్రామానికి చెందిన లంక త్రిమూర్తులు రామచంద్రపురం పట్టణంలో కొబ్బరి బొండాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో వ్యాపారం ముగించుకుని ఇంటికి తిరుగు వెళ్తుండగా వెల్ల లాకుల వద్దకు వచ్చేసరికి ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌ను అడ్డం పెట్టారు. నువ్వు యాక్సిడెంట్ చేసి వస్తున్నావంటూ త్రిమూర్తులుతో గొడవకు దిగారు. అతడిని బెదిరించి తమ మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని వెల్ల ఏరుపల్లి మధ్యలో ఉన్న లేఅవుట్ వద్దకు తీసుకువెళ్లి అతడిపై భౌతిక దాడికి తెగబడ్డారు. అతడి వద్ద నుంచి రూ. 1500 లాక్కుని పరారయ్యారు. అనంతరం త్రిమూర్తులు తన సోదరునికి ఫోన్ చేసి రప్పించుకుని ఏరియా ఆసుపత్రిలో చేరాడు. అనంతరం 100 నంబరుకు ఫోన్ చేయగా పోలీసులు వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నిందితుల్లో ఒకరైన రామచంద్రపురం పట్టణానికి చెందిన రాగిరెడ్డి సాయిని అదుపులోకి తీసుకున్నారు. జరిగిన సంఘటనపై బాధితుడి ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారాల మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

రజత కవచాల సమర్పణ



సత్యనారాయణ స్వామివారికి రజత కవచాలు అందజేస్తున్న దాతలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న రమా సత్యవతీ సమేత సత్యనారాయణ స్వామివార్లకు బుధవారం భక్తులు రజత కవచాలు సమర్పించారు. యానంకు చెందిన దాతలు కర్రి హైమావతి, సుబ్బిరెడ్డి దంపతులు, వారి కుమారుడు కర్రి భరత్ కుమార్, సింధూర దంపతులు 5.7 కిలోల వెండితో చేయించిన కవచాలను భీమేశ్వరాలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానికి అందజేశారు. భీమేశ్వరాలయ బ్రహ్మ దేవులపల్లి ఫణిరామకృష్ణ బ్రహ్మత్వంలో సంప్రోక్షణ చేయగా, ఆలయ అర్చకుడు కొంతేటి శ్రీనివాస భీమశంకరం స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామి వార్ల తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలను అందజేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: సత్యవాడ గ్రామంలో వినాయక ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఆ ఆలయాన్ని పూర్తిగా తొలగించి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపనతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత ఆలయాన్ని కొన్నేళ్ల క్రితం గ్రామానికి చెందిన పామర్తి సుబ్బారాయుడు దంపతులు నిర్మించారు. ఆ ఆలయం జీర్ణోద్ధారణ దశకు చేరడంతో కొత్త ఆలయాన్ని నిర్మించడానికి పామర్తి కుటుంబీకులు ముందుకు వచ్చారు. కొత్త ఆలయ నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు అవుతాయని నిర్ణయించారు. ఈ నిర్మాణానికి డాక్టర్ పట్టాభి రామారావు, మహాలక్ష్మీ దంపతులు భూమి పూజ చేసి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పామర్తి ఆనందరాయుడు, బాబులు, బ్రహ్మానందం, సలాది వీరబాబు, వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం: అంగర, పడమర ఖండ్రిక గ్రామాల పరిధిలోని ఇనుపవంతెన వద్ద ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇరు గ్రామాలతో కూడిన ఆలయ నిర్వాహక కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొంపెల్ల రాంబాబు ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు. స్వామి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

రైతులకు సాగునీరు అందించాలి

మండపేట: దాళ్వా పంటకు సాగునీరు వెంటనే అందించి రైతులకు మేలు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశించారు. పంట కాలువలకు నీరు అందడం లేదంటూ రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల స్పందించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో నీటి సంఘాల అధ్యక్షులు సాగునీటి సమస్యలపై వేగుళ్లకు వివరించారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని ఆధార్ వివరాలను నవీకరించేందుకు, నూతన ఆధార్ నమోదు కోసం మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి పర్యవేక్షణలో కపిలేశ్వరపురం-1, వడ్లమూరు, అంగర-1 సచివాలయాల పరిధిలోని చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్రలు ఆధార్ నవీకరణ సేవలందించారు. గురు, శుక్రవారాల్లో అంగర, కాలేరు, కోరుమిల్లి గ్రామాల సచివాలయాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.